# వరలక్ష్మీవ్రతం

శ్రీమతి కొమ్మూరి పద్మావతీదేవి

"ఏమండీ ఇంత ఆలస్యం చేశారేం?"

.................................

"మిమ్మల్నే! పలకరేం?"

"ఉండూ మరి. ఆఫీసునుంచి బయటపడి బస్సెక్కి ఇల్లు చేరేసరికి ఇంతసేపయింది. శారదా! నా మాట విని ఈ సారికి ఈ వ్రతం మానరాదా ఏదో ఇప్పుడు నావల్ల కాదు. ఆఫీసు కుర్రాడు సత్యం వస్తున్నాడు. ఏమన్నా పనులుంటే చెప్పు."

"మంచివారే! అందరినీ పిలిచి వచ్చాక మానరాదా ఏమిటండీ! నా మాట విని కాస్త వెళ్ళిరద్దురూ."

"అబ్బబ్బ! ప్రాణం తీసేస్తున్నావు శారదా! నీ వ్రతం కాదు కాని."

"తప్పండి, అదేం మాటలు! మరిచే పోయారా ఇవాళేగా గాజులూ, నెక్లెసు ఇస్తానన్నారు."

"ఊ. ఆ టిఫిను కాఫీ పడెయ్యి. ఆటోలో బజారు వెళ్ళాలి. ఎందుకొచ్చిన వ్రతాలు చెప్పూ?"

"అనకండీ అలాటి పాడుమాటలు. మీకేం బాధ. ఇదిగో కావలసినవన్నీ వ్రాసి ఇస్తున్నా."

"ఊ త్వరగా"

శారద మొహం సంతోషంతో ఇంత అయింది. తొందర తొందరగా సుందరానికి టిఫిను కాఫీ ఇచ్చి కావలసిన వస్తువుల జాబితా చేసుకుంటూ కాగితం ముందు కూచుంది.

చిటి ఆరేళ్ళది, చిన్న నాలుగేళ్ళవాడూ, ఇద్దరూ తండ్రిపక్కన చేరి భాగానికి వచ్చారు. సుందరం వాళ్ళతో కబుర్లు చెబుతూ ముద్దు చేస్తూ ఆలస్యం చేయడం శారద చూసి పిల్లల్ని కసిరి ఇవతలకు లాగి సుందరాన్ని బజారుకు పంపింది.

తెల్లారగట్ల శారద హడావిడిగా లేచింది. గుమ్మాలకు పసుపురాసి తోరణాలు కట్టింది. ఇల్లంతా ముగ్గులతో నింపింది. వంటా మొదు వంటా పిండివంటలూ పూర్తయినా ఇటూ అటూ చాలా పనులలో తిరుగుతూ అవస్థ పడుతూంది.

"చూడు సత్యం! సరీగా ఇదేమాదిరి పంచులు చెయ్యి. ఈ కాగితాలు చాలక పోతే ఇంకా ఇస్తా, నూరుకు పైగా కావాలి."

"శారదా! ఇవాళ కాఫీ నాకు ప్రాప్తి ఉందా లేదా?" అంటూ చిన్నాని ఎత్తుకుని శారద పక్కగా వచ్చి నిలబడ్డాడు సుందరం.

"నెక్లెసు, గాజులు చాలా బాగున్నా యండీ! ఇంటావిడ కూడా ఇలాంటివే చేయించు కుంటుందట" అన్నది శారద కాఫీగ్లాసు అందిస్తూ.

"బాగుండవూ మరి. కూలికే అయింది యాభయి. చిటికిమాత్రం వెయ్యకు. ఈ పీదంతా దానిదే."

"ఇవాళ మీరు ఆఫీసుకు వెళ్ళితీరాలా? వంట పూజ అయ్యేసరికి పన్నెండు గంట లయినా అవుతుంది. ఇవాళకు కాస్త నా మాట విందురూ" అంటూ శారద బతిమాలు తూండగా చిన్న తండ్రి గడ్డం పట్టుకుని కాకి కథ మొదలు పెట్టాడు-వచ్చీరాని మాటలతో. సుందరం చిన్నడిమాటలు వింటూ ఆఫీసుసంగతి మరిచి పడకకుర్చీలో జారగిలబడ్డాడు.

వరలక్ష్మీ వ్రతం ముగించి లేచింది శారద. చిటి, చిన్నా, ఇద్దరూ తల్లిపక్కనే కూచుని శ్రద్ధగా పూజ చూశారు. పిండివంటలతో దేవికి నైవేద్యం ఇచ్చి, పిల్లలకు కాస్త పెట్టి సుందరాన్ని అన్నానికి పిలవటానికి వెళ్ళింది శారద. తలనిండా పూలు. మెడనిండా గంధం. చేతికి తోరం. కాళ్ళకు పసుపు. మెడలో నెక్లెసు మెరిసిపోతూఉన్న శారదను చూసి—

"శారదా! లక్ష్మీదేవిలా ఉన్నావు. నీ మెడకు ఎంతో నిండుగా ఉంది అంతగం? మూసుకోక పూసేసుకున్నావా? సాయంత్రానికి మళ్ళా తేవలసిందే!"

"పోదురూ మీరు మరీని. దండి వడ్డన అయింది" అంటూ శారద వంటఇంటివైపు పిల్లలతో నడిచింది. శారదనే చూస్తూ సుందరంకూడా అన్నానికి వెళ్ళాడు.

పిండివంటలతో భోజనాలు కాగానే సుందరం చిటికి కథలు చెబుతూ అలాగే నిద్రపోయాడు. చాపమీద చంటివాడిని నిద్రపుచ్చుతూ అలిసిపోయిన శారద గాఢనిద్రలో పడింది. నిశ్శబ్దంగా ఉన్న ఆ ఇంట్లో వరలక్ష్మీదేవి కాటుకకళ్ళతో మెళ్ళో హారాలతో దీపాల కాంతికి మెరిసిపోతూ ఇంటికి కాపలా కాస్తూంది.

ఎవరో లేపినంత గాభరాగా ఉలిక్కిపడి లేచింది శారద. చిన్నా కదిలాడు ఆ చప్పుడుకు. ఇలంతా ఒక్కసారి చూసుకుంది శారద. వీధి తలుపు వేసేఉంది. వంటఇంటి తలుపు వేసేఉంచాయి. చప్పుడు ఎక్కడా అనుకుంటూ వరలక్ష్మిని తొంగిచూసింది.

చెంబులోని కలశం క్రిందపడి ఉంది. కొబ్బరికాయకు కట్టిన పూలజడ కాస్తా నూనె దీపంలో పడి అంటుకుని మండుతూంది. భయపడిపోతూ కలశాన్ని తియ్యబోయి చేతులు వణికి "ఏమండీ! త్వరగా రారూ?" అన్నది గట్టిగా.

"ఏం? ఏమయిందీ?" అంటూ సుందరం ఆ పిలుపుకు ఆదుర్దాగా రాగానే శారద దిగులుగా అతన్ని చూసి కంట నీరు పెట్టుకుంది.

"ఏమయింది శారదా?"

"అపశకునం. అమ్మవారు క్రింద పడింది. వేసిన పూలజడ కాలిపోయింది."

"ఓసీ ఇంతేకదా! ఇంటినిండా ఎలుకలు బియ్యానికి వచ్చి ఉంటాయి. ఎలుకలకు ఏం తెలుసు గనక వరలక్ష్మి అని. ఎంత చాదస్తం శారదా, దీనికా ఇంత బెంగ" అన్నాడు శారద కలశాన్ని సరిగ్గా పెట్టగానే బెంగ పోగొట్టాలని,



శారద కలశాన్ని సరిగ్గా పెట్టింది

"కాఫీ అయింది. ఇంక పేరంటాళ్లు వస్తారు. త్వరగా తెములు మూడుదాటింది. తెలుసా?" అంటూ సుందరం శారదకు సాయంత్రం సంగతి జ్ఞాపకం చేసేసరికి చేయవలసినవన్నీ గురించి పరధ్యానంగా వంటఇంట్లోకి వెళ్ళింది శారద.

సాయంత్రం పట్టుచీరతో ముస్తాబయి వచ్చేవారిని ఆప్యాయంగా పలకరిస్తూ, వెళ్ళే వారికి తాయిలాలిచ్చి నమస్కరిస్తూ శారద ఊపిరి ఆడనంత పనిలో ఉండిపోయింది.

"ఏం పిన్నీ ఇంత ఆలస్యం?"

"పనులన్నీ తెముల్చుకుని రావాలా మరి. కొత్త గాజులా శారదా?"

"అవును పిన్నీ! ఈ గాజులు, ఈ నెక్లెసు నిన్ననే తెచ్చారు."

"ఎంత బాగుందీ!"

"ఎక్కడ చేయించారు?" అన్నది లీల.

"ఎన్ని సవర్లు?" అన్నది పంకజం.

అంతా శారద నెక్లెసు చాలా బాగుందని చుట్టూచేరి ఒకటే మూశారు. ఏ నగ ఏ షాపులో బాగా ఉంటుందో, ఏ చీర ఏ షాపులో దొరుకుతుందో చెప్పుకుంటూ కబుర్లలో పడిపోయారు. ఇంతలో చిట్టి ఏడుస్తూ వచ్చి తల్లి కుచ్చిళ్లుపట్టుకుని,

"అమ్మా, చూడమ్మా! వాడు నన్నూ చిన్ననీ గిల్లుతున్నాడమ్మా!"

"అమ్మవు కాదూ. చిన్నని ఆడించుకెళ్ళూ"

"నే పోనమ్మా" అంటూ శారద కుచ్చెళ్లు గట్టిగా పట్టుకుంది చిట్టి. చిన్న తల్లి కొంగును బిగించి కూడా నిలబడ్డాడు. పేరంటాళ్ళతో హాలంతా నిండిపోయింది. ఇంకా వస్తూనే ఉన్నారు.

శారద ఇద్దరు పిల్లల్నీ విసుక్కుంటూనే వాళ్ళు కూడా కూడా కొంగు పట్టుకుని తిరుగుతూవుంటే వచ్చినవారికి తాంబూలాలు ఇస్తూనే వుంది. లోపలికి వచ్చిన సీతమ్మ కూర్చోకుండానే "ఏవిటండీ! కొత్తరకం నెక్లెసు చేయించుకున్నారట లీల చెప్పింది?" అంటూ శారద దగ్గరగా వచ్చి నిలబడేసరికి శారద మెడమీద చెయ్యి పెట్టుకుని తడుముకుని తెల్లపోతూ,

"ఏమయిందీ! ఇప్పుడున్నదే!" అన్నది కంగారుపడుతూ. సీతమ్మతోపాటు అక్కడ వున్న పేరంటాళ్ళంతా ఒక్కసారిగా లేచి నిలబడ్డారు.

"ఇప్పుడు ఉన్నదండీ? ఎక్కడన్నా జారి వుంటుంది. సరిగ్గా చూడండి" అన్నది ఒకావిడ.

శారద నీరసంగా పిల్లల్ని అవతలకు తోసి వెతకడం మొదలు పెట్టింది. శారదతో అంతా వెతకడం మొదలు పెట్టారు. చాపలూ, తివాసీలూ తీసి నేలంతా వెతికారు. తాంబూలాలు ఇస్తున్న గదీ, పళ్ళబుట్టా, పళ్లాలూ అన్నీ తీసి ఎంత వెతికినా నెక్లెసు కనపడలేదు. శారదకు అపశకునం స్ఫురణకు వచ్చి కళ్ళనీళ్లు నిండాయి. అంతా తలా ఒకమాట అన్నారు. కొందరు ఊరికే ప్రశ్నలు. "బయటికి కదలందే మీరు. ఇంట్లోనే వుంటుంది వెతకండి. దిగాలు పడితే ఎలా?" అన్నది ఒకావిడ వెళ్ళిపోతూ.

ముత్తయిదువలంతా నెక్లెసు పోయినసంగతే చెప్పుకుంటూ మనస్సు చివుక్కుమంటూ చక్కా పోయారు.

"ఏ పుట్టలో ఏ పాముందో." అంటూ సీతమ్మ పిన్ని కూడా వెళ్ళిపోయింది.

ఆ తరికం. బాటిగా వచ్చేవాళ్లు వస్తూనే ఉన్నారు. తాంబూలాలు ఇస్తూనే వుంది శారద నీరసంగా. వరలక్ష్మీవ్రతం ఈవిధంగా ముగిసింది శారదకు.

సుందరం ఇంట్లోకి వస్తూనే నెక్లెసు పోయిన సంగతి విని విసుక్కుంటూ అరిచాడు.

ఏడాది దాచిపెట్టిన డబ్బు. ఎంతో కష్టపడి పోగుచేసిన డబ్బు. శారద మెడకు నిండుగా వుండాలని ఎంతో ఆశతో చేయిం

(మిగతా 63 వ పేజీలో)

# ★ వరలక్ష్మీ వ్రతం ★

(24 వ పేజీ తరువాయి)

పాడు. శారద పీటమీదనుంచి, సుందరం చిట్టితో ఆ రాత్రి గడిపింది.

శారదకు తెల్లవారింది రోజూలాగే. వెతికిన చోటే వెతుకుతూ ఇల్లంతా మళ్ళా వెతికింది పాపం! నిరాశతో వరలక్ష్మీదేవి దగ్గరికి వచ్చి చేతులు జోడించి నమస్కరించి—

“తల్లీ! కనికరించు, కనపడి చేయించుకున్న సొమ్ము మాకు కాకుండా చేశావా, నే నేం అపకారం చేశాను?” అన్నది గట్టిగా. వరలక్ష్మీ ధ్యానంలో వున్న తల్లిని చిట్టి ప్రశ్నల వర్షం కురిపిస్తూ భుజంమీద చెయ్యి వేసింది. శారద చికాకుతో చిట్టిని చీదరించుకుంటూ తోసేసరికి, “ఎందుకూ దాన్ని కసురుతావు. నీ మందమతితనానికి పిల్ల లేం చేశారు?” అంటూ కసురుతూ చిట్టిని దగ్గరగా తీసుకున్నాడు సుందరం.

శారద వంచిన తల ఎత్తలేదు. నోరు మెదప లేదు. ఇరుగూ పొరుగూ సొమ్ము పోయిందని ఒకరొకరే ప్రశ్నలతో పరామర్శించ వచ్చారు.

పోయిన సొమ్ము పోగా వచ్చినవాళ్ళ నోటితో పలకరింపులతో శారద బిక్కచచ్చి పోయింది. సుందరం కాఫీనా త్రాగకుండా కోపంతో వెళ్ళిపోవడంతో శారదకు భయం వేసింది.

“శారదమ్మగారూ! నేనే తీశానని తోస్తే మీ కాలి చెప్పుతో కొట్టండి. పోలీసులను ఇంటిమీదికి పంపుతారా?” అంటూ శారద కాళ్ళమీద పడింది పనిచేసే అలివేలు.

“తల్లీ తండ్రీ లేదమ్మా; దొంగపని చెయ్యడు తల్లీ! పోలీసులు చావ బాదేస్తున్నారు తల్లీ! సత్యం బతికి బయటపడతాడా! తల్లీ! అమ్మా! ఎన్ని దెబ్బలూ, చంపేస్తున్నారమ్మా! పిల్లలు గల తల్లివమ్మా కనికరించమ్మా!” అంటూ సత్యం మామ వీధి గుమ్మంలో ఏడుస్తూ నిలబడాడు. ఇంటిముందిగ జనం పోగయ్యారు. తలా ఒకరూ ఒక్కొక్కమాట అంటూ వింతగా చూస్తున్నారు. శారద తల తిరిగింది.

సుందరం అందరినీ తోసుకుంటూ కోపంగా లోపలికి వచ్చాడు.

“పోయినసొమ్ము పోనే పోయింది. పోలీసులకు ఎందుకు చెప్పారని పాపం, వాళ్లు తీశారో లేదో!”

.................................

“మిమ్మల్నే, సత్యాన్ని చావ బాదేస్తున్నారట!”

“బాదనీ, చావ బాదనీ, తీస్తే వస్తుంది.”

“తియ్యకపోతే....”

“తియ్యకపోతే వస్తువు నడిచి వెళ్ళిందా ఏం?”

“తియ్యని వాళ్ళను అంటే మనకే పాపం.”

“పాపమట పాపం, పుణ్యమట! నోరుముయ్యి” అంటూ సుందరం కసురుకోగానే శారద భయపడిపోతూ లోపలికి చక్కా పోయింది.

వరలక్ష్మి అలంకారంలో వున్న కొబ్బరికాయను ఒళ్ళో పెట్టుకొని కాటుకంతా తీసి ముఖానికి పులుముకుంటూంది చిట్టి, ముద్దుగా అమర్చిన పసుపుముద్దను లాగి చిన్న చిన్న ముద్దలుగా చేసి ఆడుతూ “గోళీలు చిట్టీ, పసుపు రంగు గోళీలు” అంటూ చిన్ని అమిత ఆనందంతో నవ్వుతుంటూ వుండగా శారద ఇద్దరినీ చూసి అపుకోలేని కోపంతో “అయిన అపశకునం చాలకనా! పాడు పిల్లలు” అంటూ చిట్టి చేతిలోని కొబ్బరికాయను తీసి బుట్టలో విసరబోయి కింద పడవేసింది. కాయ పగిలింది. గుమ్మంలో పురోహితుని భార్య వెంకమ్మ నిలబడింది.

“ఇదిగోనండీ మీ దండ తాంబూలం సంచిలో దొరికింది” అంటూ శారదకు దండ అందిచ్చింది.

శారద వెంకమ్మ చేతిలోని నెక్లెసు చూస్తూ ఆవిడ మెళ్ళో నల్లపూసలూ, చిరిగిన చీర చూస్తూ తెల్లబోతూ చెయ్యి జాపింది.

బయట అందరినీ సుందరం ఎలాగ సాగనంపాడో కాని....శారద మాత్రం చీర, రవికతో తాంబూలంలో పదిరూపాయలు పెట్టిన పళ్ళెం వెంకమ్మ చేతికి అందించి పసుపు పాదాలకు వంగి నమస్కరించింది. ★

